

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.96	1,621.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,576
సామర్థ్యం (టీఎంసీలు)	10.18	66.26

పండుగపూట పావురాల హుషార్..

గింజల కోసం పక్షుల గుంపులు బారులు..బారులు!



చూడడానికి ఎంతో మనోజ్ఞంగా ఉండే ఈ దృశ్యం ప్రస్తుతకాలంలో కనిపించడం అరుదుగా మారింది. కురుగోడు తాలుకా, సిద్దమ్మనహళ్లి ప్రాంతంలో జొన్న, సజ్జ పంటలు బాగా పండటంతో పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి పావురాలు వలస వస్తున్నాయి. జొన్న, సజ్జ పైర్లపై వాలి గింజలను ఏరుకుతింటున్నాయి. పైరుబాగా



పండిన చోట భారీ ఎత్తున పక్షులు పొలాల్లో వాలుతూ చూపరులకు కనువిందు చేస్తున్నాయి. సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు తరలివచ్చేఉద్యోగుల్లాగా పక్షులు కూడా వస్తున్నాయని సందర్శకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు మాత్రం వాటి బారి నుంచి పంటలను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ✍ కంప్లి

శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాత్యాయిని మరిదేవయ్య

బళ్లారి సిటీ, జనవరి 13: పిల్లలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఎస్.జీ కళాశాల పాలక మండలి అధ్యక్షురాలు కాత్యాయిని మరిదేవయ్య విద్యార్థులకు పిలుపు నిచ్చారు. కర్ణాటక స్టేట్ సైంటిఫిక్ రీసెర్చ్ కౌన్సిల్ జిల్లా యూనిట్‌లో వివేకానంద జన్మదినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు లోకరాజ్ తన ఉపన్యాసంలో గణిత శాస్త్రానికి భారతీయులు చేసిన కృషి గురించి వివరించారు. జిల్లా యూనిట్ అధ్యక్షుడు ఆర్.హెచ్.ఎం.చన్నబసయ్యస్వామి మాట్లాడుతూ యువ ప్రతిభావంతులు వైజ్ఞానిక చింతనతో పాటు వివేకానంద ఆశయాలను పాటించాలన్నారు. యువశక్తి దేశ సంపద అని, కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎస్.హిరేమఠ్ సైన్స్ గీతాలు ఆలపించి చిన్నారులను అలరించారు. ఎస్.జీ కళాశాల ప్రిన్సిపాల్ శరణబసవరాజ్ మాట్లాడుతూ దేశ శ్రేయస్సు కోసం కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా మంజునాథ్, సంతోష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ కళాశాలలో యువజన దినోత్సవం



కీర్మాణిని సన్మానిస్తున్న బెస్ట్ కళాశాల ప్రముఖులు

బళ్లారి సిటీ, జనవరి 13: బళ్లారి ఇండిపెండెంట్ ప్రీ-గ్రాడ్యుయేట్(బెస్ట్) ఇన్‌స్టిట్యూట్‌లో ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ న్యూఢిల్లీ వారిచే యువజన దినోత్సవ వేడుక, 14వ వార్షిక యువ పురస్కార వేడుక శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలన తదితర విలువలను అలవర్చుకోవాలన్నారు. యువజన దినోత్సవంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులకు యువనిధి పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా భారతీయ స్కౌట్స్ అండ్ గైడ్ గుణశీలన్, శ్రీమతి సీమా రాటి, శ్రీమతి పద్మిని పిళ్లై, బెస్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్ కోనంకి రామప్ప, వైస్ ప్రెసిడెంట్ తిలక్ కుమార్, కార్యదర్శి మన్నె శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, వైస్.ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కప్పగల్లు రోడ్డులోని షాపుల్లో చోరీ



చోరీ జరిగిన ఓ దుకాణం

బళ్లారి సిటీ, జనవరి 13: నగరంలోని కప్పగల్లు రోడ్డులోని వాణిజ్య దుకాణాల్లో శనివారం తెల్లవారుజామున దొంగలు వరుస చోరీలు చేసి వేల రూపాయల నగదు దోచుకెళ్లారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముఖానికి మాస్కులు ధరించి షాప్ షట్టర్ లోంచి లోపలికి ప్రవేశించిన దొంగలు క్యాష్ కౌంటర్‌లో డబ్బును అపహరించారు. వరుసగా మేడ్ ప్లస్ దుకాణంలో రూ.24880, సాయి ఇందిరా మెడికల్‌స్టోర్ నుంచి రూ.8000, కనకదుర్గమ్మ ప్రొవిజన్‌స్టోర్ నుంచి రూ.1000, విజయరామ సూపర్ మార్కెట్ నుంచి రూ.17వేలను అపహరించినట్లు ఫిర్యాదు అందింది.

కమనీయం కమ్మవారి విందు

21న బళ్లారిలోని ధర్మారెడ్డి ఫంక్షన్ హాల్, కొళగల్లు వద్ద భారీగా ఏర్పాట్లు

బళ్లారి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వివాహ భోజనంబు.. వింతైన వంటకంబు.. వియ్యాలవారి విందు అహ్హహ! నాకే ముందు! అంటూ మాయా బజార్‌లో ఘటోత్కచుడు భోజనం చేసే దృశ్యం మరోసారి ఆవిష్కృతమవుతోంది.

భారీస్థాయిలో బళ్లారిలో కమ్మవారి కమ్మని విందు భోజనానికి ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 21న బళ్లారిలోని ధర్మారెడ్డి ఫంక్షన్ హాల్, కొళగల్లు వద్ద కమ్మవారి కమ్మని విందుభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమ్మ సంఘం నాయకులు తెలిపారు. బళ్లారి, విజయనగర, రాయచూరు, సిరుగుప్ప, సింధనూరు, గంగావతి, తదితర ప్రాంతాల్లోని వివిధ క్యాంపుల నుంచి కమ్మవారు సుమారు 25 వేల మంది ఈ విందు భోజన కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా చంద్రబాబునాయుడు జైలు నుంచి బయటకు రావడం, అలాగే నారా లోకేష్ యువగళం విజయవంతమైన నేపథ్యంలో ఈ విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమ్మ సంఘం నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా అనేక ప్రాంతాల నుంచి కమ్మసంఘానికి సంబంధించిన మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను శనివారం మంచి ముహూర్తంలో ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మసంఘం నాయకులు లాల్ మోహన్, కుడితిని శ్రీనివాస్, విష్ణు, జేఎస్ ఆంజనేయులు, హరిబాబు, మోహన్‌దాసు, ప్రకాష్, సురేష్, వెంకట్రావు (నాని), రాఘవేంద్ర, ఎన్‌కే సూరి, ఆనంద్ చౌదరి, ఎం.విజయ్ కుమార్, శ్రీనివాసులు, చిన్నప్పయ్య, బెస్ట్ శీన, రామప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.



విందు భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్న కమ్మ సంఘం నాయకులు

ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు



కంప్లి, జనవరి 13 : సంక్రాంతి వేడుకల సందర్భంగా ఇప్పటికే కంప్లి పట్టణంలోని పలు చోట్ల ఇళ్లముందు మహిళలు రంగురంగుల ముగ్గులు వేస్తూ ఆకట్టుకుంటున్నారు. మూడు రోజుల పాటు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకుంటారు. ఆది, సోమ, మంగళవారాల్లో మూడు రోజులపాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను అత్యంత ఉత్సాహంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే బెంగళూరు నుంచి పలువురుఉద్యోగులు తమ స్వగ్రామాలకు పయనమై వస్తున్నారు. దీంతో సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.

ఫిట్స్‌తో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సిరుగుప్ప, జనవరి 13 : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు క్రైమ్ ఎస్‌ఐ వన్నప్ప తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో తెల్లవారుజామున ప్రభుత్వాస్పత్రిలో ఓ వ్యక్తి ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి దాదాపు 30 సంవత్సరాల వయసు వుంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తక్షణమే పోలీసులకు తెలపాలని ఆయన పేర్కొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి



కురుగోడులో ఏఐకేకేఎంఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న రైతులు

కంప్లి, జనవరి 13 : రైతులు పండించిన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ ఎస్‌యుసీఐ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు దేవదాసు డిమాండ్ చేశారు. కురుగోడు పట్టణంలో ఏఐకేకేఎంఎస్ రైతుల ఆధ్వర్యంలో తాలుకా సమ్మేళన కార్యక్రమం జరిగింది. అంతకుముందు రైతులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మాత్రం గిట్టుబాటు ధరలు కల్పించలేకపోతున్నారన్నారు. రైతులందరికీ న్యాయం లభించేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఐక్యంగా ముందుకెళ్లినప్పుడే న్యాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్ణ, జడగన్న, జిల్లా అధ్యక్షులు గోవిందు, గురాల రాజా, కోశూరు సంఘంఅధ్యక్షులు లింగప్ప, వన్నూరప్ప, ఖాసీమ్ సాబ్, మారెప్ప, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట పిల్లలకు విద్యాభ్యాసం చేయాలి: ఎమ్మెల్యే గణేష్



గిరిజన నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు

కంప్లి, జనవరి 13 : ప్రతి ఇంట తమ పిల్లలకు విద్యాభ్యాసం చేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పేర్కొన్నారు. కంప్లి పట్టణంలోని చేతన్ విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్నిటికన్నా విద్య ఎంతో గొప్పదని, కనుక ప్రతి పిల్లవానికి విద్య ఎంతో అవసరమన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. వారు ఇటు పాఠశాలకు, అటు ఉపాధ్యాయులకు, పట్టణాలకు కూడా గుర్తింపు తెచ్చారన్నారు. పిల్లలు వివిధ రంగాలలో కూడా రాణించేలా వారికి ప్రత్యేకశిక్షణ ఇప్పించాలన్నారు. అనంతరం పలువురు నాయకులను యాజమాన్యం అభినందించి సన్మానించింది. వివిధ సంగీత పాఠాలకు, జానపద గీతాలకు విద్యార్థులు నృత్యాలు చేస్తూ అలరించారు. వ్యవస్థాపకులు శ్రీనివాసులు, తాలుకా అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ, విశ్వనాథ్, సుదర్శన్ రెడ్డి, వీరేష్, ఆరాధ్య, జయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఖాదర్ షా ఉరుసు



ఖాదర్ షా మౌలి దర్గా

సిరుగుప్ప, జనవరి 13 : ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఖాదర్ వలీ షా మౌలి ఉరుసు కార్యక్రమాలు జరుగుతున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ 16వ తేదీ గంధం, 17న ఉరుసు, 18న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సిరుగుప్ప పట్టణం డబుల్ బాండ్ ఇంటి పక్కన వున్న దర్గాలో ఈ కార్యక్రమాలు జరుగనున్నాయన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నోట్ పుస్తకాల పంపిణీ



భగత్‌సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, జనవరి 13: నగరంలోని భగత్ సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మిల్లర్‌పేట ప్రభుత్వపాఠశాలలో శనివారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లాఅధ్యక్షుడు శాశావలి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన నోట్‌బుక్‌లు, అచ్చుబుక్‌లు అందజేస్తే వారి చదువుకు ఉపయోగపడుతాయన్నారు. అందుకే తమ అసోసియేషన్ పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేసిందన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు మురళి, కార్యదర్శి రాము, కోశాధికారి షేక్షావలి, వెంకటేశ్‌బాబుతో పాటు పలువురు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారణాయుధాలతో దాడి.. మహిళ మృతి

సిరుగుప్ప, జనవరి 13 : వైవాహికేతర సంబంధాల కారణంగా ఓ మహిళ మృతి చెందిన ఉదంతం ఇది. ఇదే అనుమానంతో ఎదురెదురుగా వుండే కుటుంబాలవారు పరస్పరం మారణాయుధాలతో దాడులు చేసుకోగా తాయమ్మ (57)అనే మహిళ మృతిచెందింది. క్రైమ్ ఎస్‌ఐ వన్నప్ప తెలిపిన వివరాల మేరకు సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు గ్రామంలో నాగరాజు అలియాస్ అండి నాగ తన భార్యతో, తాయమ్మ కుమారుడు కృష్ణ వైవాహిక సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో తరచుగా ఘర్షణ పడుతుండేవాడు. ఈ వైషమ్యాల కారణంగా శనివారం నాగరాజు తాయమ్మపై మారణాయుధంతో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు కృష్ణ కూడా గాయాలపాలయ్యాడు. దీనిపై సిరుగుప్ప పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ హనుమంతప్ప కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

స్వగ్రామాలకు తరలి వస్తున్న తమిళులు



పొంగల్(సంక్రాంతి)కి స్వగ్రామాలకు వెళ్లేందుకు బారులు తీరిన వాహనాలు

హోసూరు జనవరి 13 : తమిళుల సంప్రదాయ పండుగ పొంగల్‌ను ఆదివారం నుంచి బుధవారం వరకు జరుపుకోనున్నారు. పొంగల్ పండుగ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలకు శుక్రవారం నుంచి వరుసగా ఐదు రోజులు ప్రభుత్వ సెలవులు కావడంతో బెంగళూరు, కర్ణాటకలోని ఇతర ప్రాంతాల్లో నివసించే తమిళులు శనివారం మధ్యాహ్నం నుంచి హోసూరు మీదుగా తమిళనాడులోని తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. కర్ణాటక రాష్ట్రం అత్తిపల్లి టోల్ రోడ్డు మీదుగా వాహనాలు భారీసంఖ్యలో తమిళనాడులోకి ప్రవేశించాయి. తమిళనాడు-కర్ణాటక రాష్ట సరిహద్దుల్లోని అత్తిపల్లి, హోసూరు కార్పొరేషన్‌లోని 1 వ సిప్‌కాట్ ప్రాంతం వందలాది కార్లతో నిండిపోయింది. సుమారు 3 కిలో మీటర్ల దూరం వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో జాతీయ రహదారిపై వాహనాలు నెమ్మదిగా వెళ్లాయి, దీంతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ర్యాలీ

హోసూరు(సిప్‌కాట్) జనవరి 13 : హోసూరు కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల మేరకు (మంజాపయ్) పాలిథీన్ కవర్లపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ హోసూరు బాలికల ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమై రైతు బజారు మీదుగా బాలికల ఉన్నత పాఠశాల వరకు సాగింది. హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక ర్యాలీని ప్రారంభించారు. హోసూరు కాలుష్య నియంత్రణ మండలి పి.కృష్ణన్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సెందిల్‌కుమార్, అసిస్టెంట్‌ఇంజనీర్ ర్యాలీలో పాల్గొన్నారు, హోసూరు అసోసియేషన్ ప్రజలు తమ వాహనంలో వెళుతూ అక్కడక్కడ బ్యానర్లు ఏర్పాటుచేసి సంచులపై అవగాహన కల్పించారు. హోసూరులో ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వలన వచ్చే కాలుష్యం నుంచి దూరంగా ఉందామని స్పీకర్లల్లో ప్రకటిస్తూ వాహనాల్లో వెళ్లారు. పోలీసులు బందో బస్తు ఏర్పాట్లు చేశారు.

వాలీబాల్ పోటీల్లో ట్రోఫీ గెలుచుకున్న విద్యార్థులు

హోసూరు(మత్తిగిరి) జనవరి 13 : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో హోసూరు ప్రభుత్వ పాఠశాల బాలికలు ప్రథమస్థానం పొందారు. జనవరి 12న విరుదునగరంల్లో ఉన్న కలసలింగం యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయిల్లో వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో హోసూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు ట్రోఫీని గెలుచుకున్నారు. విరుదునగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు హోరాహోరీగా పోటీలో పాల్గొన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయి విజయం సాధించిన హోసూరు విద్యార్థులకు కోచ్ మాణిక్యవాసగం, మేయర్ సత్య, రవి, వెంకటేశ్ విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న మేయర్ సత్య

చరిత్ర తెలిసినవారే రికార్డు సృష్టిస్తారు : సీఎం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్ధరామయ్య

రాయచూరు, జనవరి 13 : సామాజిక సమానతలు ఉన్నప్పుడే అభివృద్ధికి మార్గం మరింత సుగమమవుతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. చరిత్ర తెలిసినవారే అభివృద్ధిలో చరిత్ర సృష్టిస్తారని చరిత్రపట్ల అవగాహన లేనివాళ్ల వారి వల్ల అభివృద్ధి వెనకబాటుతనం తప్పదని అన్నారు. ఈ విషయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారని పేర్కొన్నారు. జిల్లాలోని దేవదుర్గ తాలూకా తింథిణి బ్రిడ్జ్ వద్ద నిర్వహిస్తున్న హాలుమత సాంస్కృతి క వైభవం కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వివక్ష, దౌర్జన్యం నిలవరించడం విద్యతోనే సాధ్యమన్నారు. విద్యావంతులైన వారే పునర్నిర్మాణానికి బాటలు వేయగలరన్నారు. కాగా హాలుమత సాంస్కృతి వైభవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రశంసించిన ముఖ్యమంత్రి, కనకదాస్, బసవేశ్వరుడు కులమతాల ప్రస్తావనను ఎక్కడ చూపలేదని వారందరికీ వారి విధానాల వలన అనేక ఇబ్బందులు ఎదురయ్యాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. దేశ సంపద 143 కోట్ల ప్రజలదే గాని ఏ ఒక్కరిది కాదని, జాతీయ సంపదను ప్రతి ఒక్కరు అనుభవించడమే కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. కాగా అన్ని వర్గాలు అన్ని జాతుల వారికి అధికారంలో సమాన అవకాశం లభించినప్పుడే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఆ దిశగా అభ్యుదయవాదులు, శరణులు, రాజకీయ నాయకులు తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గొర్రెల కాపరి మృతి

రాయచూరు, జనవరి 13 : జిల్లా కేంద్రానికి సమీపంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరి మృత్యువాతపడ్డాడు. మృతుడు తెలంగాణలోని కేటీ దొడ్డి మండల కేంద్రానికి చెందిన శివు(35) గా గుర్తించారు. గొర్లను మేపుతున్న ఇతడిపైకి గుర్తుతెలియని వాహనం రావడంతో కాపరితో పాటు మరో ఆరు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. సంఘటన స్థలాన్ని పరిశీలించిన వెస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేసుకుని ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం వేట ప్రారంభించారు.



కాంగ్రెస్‌ను వెంటాడుతున్న భయం : యడియూరప్ప

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రామమందిర ప్రతిష్ఠాపన బీజేపీకి అనుకూలమవుతుందనే భయం కాం గ్రెస్ వర్గాల్లో వెంటాడుతోందని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పేర్కొన్నా రు. శనివారం శివమొగ్గలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రామ మందిర ప్రతిష్ఠాపనలో అన్ని పార్టీల వారు భాగస్వామ్యులు కావాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆశయంగా ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ వారికి మంచి ఆలోచనలు వచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని హితవు పలికారు. పెజావర పీఠాధిపతి వ్యాఖ్యలను తప్పుపట్టాల్సిన పనిలేదన్నారు.

రాముడి పేరుతో బీజేపీ రాజకీయం : తిమ్మాపుర

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తాము అందరి దేవుళ్లను నమ్ముతామని, అందుకు అనుగుణంగానే పూజలు చేస్తామని రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని అబ్కారీశాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర తెలిపారు. హుబ్బళిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము శ్రీరాముడిని భక్తితో కొలుస్తామని అన్నారు. హిందూమతంలో రాముడికి ప్ర త్యేక స్థానం ఉందన్నారు. కానీ బీజేపీ నేతలు రాముడి పేరుతో రాజకీయ లబ్ది కోసం ప్రయత్నం చేస్తున్నార న్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీలో ఇప్పటికే ప్రక్రియ సాగుతోందన్నారు. త్వరలోనే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఎన్నికలంటే మంత్రులకు బాధ్యతలు సహజంగానే ఎక్కువగా ఉంటాయన్నారు. అదే తరహాలోనే ఎమ్మెల్యేలకు బాధ్యత ఉంటుందన్నా రు. బీజేపీ వారు ప్రజా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగానే వ్యవహరిస్తారని తెలిపారు. రాహుల్‌గాంధీ పాదయాత్రను అడ్డుకోవాలనుకోవడం సమంజసం కాదన్నారు.

రెండు నెలల్లో కులగణనకు ఆమోదం

- రామ మందిరానికి కాంగ్రెస్ వ్యతిరేకం కాదు
- రాముడి పేరుతో బీజేపీ రాజకీయ డ్రామాకు వ్యతిరేకం
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

రాయచూరు, జనవరి 13 : రెండు నెలల్లో కుల గణనకు ఆమోదం తెలుపుతామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు.సంక్రాంతి పండుగ సందర్భంగా రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకాలోని తింథిణి బ్రిడ్జి వద్ద కనకగురుపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాలుమత సాం స్కృతిక వైభ వ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం వచ్చిన ఆయన విలేకరులతో కొద్దిసేపు మాట్లాడారు. వెనుకబడిన వర్గాల శాశ్వత సమితి అధ్యక్షుడు జయప్రకాశ్ హెగ్డే రెండు నెలల్లోగానే నివేదిక ఇస్తామని చెప్పినందున దానిని ఆమోదించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి స్పష్టత ఉందని అన్నారు. రామ మందిర నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, రాముడి పేరుతో బీజేపీ చేస్తున్న రాజకీయ డ్రామాకే వ్యతిరేకమన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటానికి నేతృత్వం వహించిన కాంగ్రెస్ పార్టీ అనంతరం సుదీర్ఘ కాలం పాటు సాగించిన పాలనలోను అన్ని వర్గాలు, మతాలు, కులాల పట్ల సమానభావంతోనే వ్యవహరించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. బీజేపీ మాదిరిగా తమ పార్టీ మతపరమైన రాజకీయాలను ప్రేరేపించదని, ఈ విషయంలో లౌకికవాదానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటికి కట్టుబడి ఉంటుందన్నారు. మైసూరు లోకసభ నియోజక వర్గం నుంచి డాక్టర్ యతీంద్ర బరిలో ఉంటారని వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి సూటిగా స్పందించకుండా తానుగానీ, యతీంద్రగానీ ఈ విషయం ఎక్కడ చెప్పలేదన్నారు. లోక్‌సభ అభ్యర్థి ఎంపికకు సంబంధించి స్థానిక శాసనసభ్యులు, నాయకుల అభిప్రాయాల మేరకే నిర్ణయం ఉంటుందని తెలిపారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి బోర్డుకు ఇప్పటికే రూ.5 వేల కోట్లను విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. నిధుల వినియోగానికి సంబంధించి గవర్నర్ అనుమతి అవసరం ఉన్న నేపథ్యంలో కొంత జాప్యం జరుగుతున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. త్వరలోనే ఈ ప్రాంతానికి చెందిన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నిధుల వినియోగానికి సంబంధించి తగిన సూచనలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య


హెలిప్యాడ్ వద్ద సీఎం సిద్ధరామయ్యను స్వాగతిస్తున్న పార్టీ నేతలు

హావేరి ఘటనను సిట్‌కు అప్పగించాలి


మీడియాతో మాజీ సీఎం బొమ్మై

- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటం
- మాజీ సీఎం బొమ్మై
- నేడు హావేరికి బీజేపీ మహిళా బృందం

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హావేరి తాలూకాలోని నాల్కరెక్రాస్ సమీపంలోని హోటల్లో మైనారిటీ మహిళపై జరిగిన దాడి కేసులో నిజానిజాలు బయటపడాలంటే సిట్‌తో విచారణ జరపాల్సిందేనని బీజేపీ డిమాండ్ చేసింది. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ఉపముఖ్యమంత్రులు డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, గోవిందకారజోళ శనివారం మీడియాతో మాట్లాడారు. జిల్లా పోలీసులు, స్థానిక పోలీసులతో బాధిత మహిళలకు న్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు. మహిళపై సామూహిక అత్యాచారం జరిగినట్టు మీడియాలో కథనాలు వచ్చాయని, దీనిపై సిట్‌తో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీనియర్ పోలీసు ఉన్నతాధికారులతో సాధ్యమైనంత త్వరగా విచారణ జరిపించి నిందితులకు కఠినశిక్ష పడేలా చూడాలన్నారు. ఈ ఘటనలో కేవలం ముగ్గురిని మాత్రమే అరెస్టు చేశారని, మిగిలినవారు ఏమయ్యారని ప్రశ్నించారు. నిందితులు ఒక ప్రత్యేక సామాజిక వర్గానికి చెందినవారు కావడంతోనే వీరిని రక్షించే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. గతంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయంటూ గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ఆరు నెలల పాలనలోనే పరిస్థితి అధోగతికి దిగజారిందన్నారు. ఒక్క బెంగళూరు నగరంలోనే మహిళలపై నేరాలు 30 శాతం పెరిగాయన్నారు. నగరాలు, పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. బెళగావిలో శాసనసభ సమావేశాలు జరుగుతున్న తరుణంలోనే ఒక మహిళను వివస్త్రగా చేసి ఊరేగించారని గుర్తు చేశారు. నేరస్థుల మతం చూసి కేసులు పెట్టాల్సిందిగా పోలీసులకు ఏమైనా సూచన చేశారా..? అంటూ హోంశాఖ మంత్రిని నిలదీశారు. మోరల్ పోలీసింగ్ ఏ రూపంలో ఉన్నా, ఎవరు చేసినా తాము తీవ్రంగా ఖండిస్తూనే వచ్చామన్నారు. రాష్ట్రం ఆర్థికంగానే కాకుండా శాంతిభద్రతల విషయంలోనూ దిగజారిందని ఆరోపించారు. ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్‌తోపాటు పలువురు సీనియర్ నేతలు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

నేడు హావేరికి బీజేపీ మహిళా బృందం

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల సారథ్యంలో మహిళా నేతల బృందం ఆదివారం హావేరి జిల్లాలోని ఘటనా ప్రాంతాన్ని పర్యటించనుంది. బాధిత మహిళను కలసి నిజనిర్ధారణ జరపనుంది. అనంతరం పార్టీ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు నివేదికను సమర్పించనుంది. ఈ మేరకు బీజేపీ నగరంలో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

రేస్‌కోర్సు బుకింగ్ కౌంటర్‌పై సీసీబీ దాడులు


స్వాధీనం చేసుకున్న నగదు

- రూ.3.47 కోట్ల నగదు సీజ్
- 66 మంది అరెస్టు.. విడుదల

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రేస్‌కోర్సు బుకింగ్ కౌంటర్‌పై సీసీబీ పోలీసు బృందాలు దాడి చేసి సమగ్ర వివరాలు లేని రూ.3.47 కోట్ల నగదును సీజ్ చేశాయి. శుక్రవారం రాత్రి 10 గంటల వేళ సీసీబీ బృందాలు దాడి ప్రారంభించి తెల్లవారు దాకా సోదాలు నిర్వహించాయి. ఒక్కసారిగా బుకింగ్ కౌంటర్ల వద్దకు చేరుకున్న పోలీసు అధికారులు అక్కడి సిబ్బందిని బయటకు వెళ్లకుండా కట్టడి చేశారు. అనంతరం రికార్డులు పరంగా నగదును పరిశీలించారు. రికార్డులు లేకుండా కౌంటర్లలో ఉండే రూ.3.47 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు హైగ్రౌండ్స్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బుకింగ్ కౌంటర్ల సిబ్బంది సహా సుమారు 66 మందిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్ బెయిలుపై విడుదల చేశారు. కాగా అందరికీ నోటీసులు జారీ చేశారు. ఎప్పుడు కోరినా విచారణలకు హాజరుకావాలని ఆదేశించారు. బుకింగ్ కౌంటర్‌లో లభ్యమైన నగదుకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని తెలిపారు. ఒకవేళ రికార్డులు పొందుపరచకుంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు కేసు బదిలీ చేస్తామని, అనధికారికంగా బెట్టింగులు సాగుతున్నట్లు సమాచా రం మేరకే దాడులు చేసినట్లు నగర పోలీసు కమిషనర్ దయానంద్ ప్రకటించారు. అనధికారికంగా సాగుతున్న బెట్టింగ్ లాభం ఎవరు పొందేవారనే కోణంలో విచారణలు జరుపుతామన్నారు. వీటి వెనుక సూత్రధారులను తేలుస్తామన్నారు.

పోలీసుల దాడిలో పట్టుబడిన నగదు



సౌర విద్యుత్‌కు ఉచితం దెబ్బ

- 30 శాతం పడిపోయిన ప్యానెల్స్ విక్రయాలు

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ పథకాల్లో ఒకటైన గృహజ్యోతి కారణంగా ఉచిత విద్యుత్‌ను అందుకుంటున్న వినియోగదారులు సౌర విద్యుత్‌పై పెద్దగా ఆసక్తిని కనబరచడం లేదు. ఈ పథకం అమలైనప్పటి నుంచి అంటే గత ఆరునెలల అవధిలో సౌరవిద్యుత్ ప్యానెల్స్ కొనుగోలు చేసే వారి సంఖ్య బాగా తగ్గిపోయిందని సౌరవిద్యుత్ పరిశ్రమ వర్గాలు వాపోతున్నాయి. సౌర విద్యుత్ ప్యానెల్స్ విక్రయాలు దాదాపు 30 శాతం తగ్గాయని, పరిస్థితి ఇలాగే సాగితే ఇది సగానికి తగ్గినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించాయి. ఉచిత విద్యుత్ పథకం పరిధిలోకి రాని వినియోగదారులు మాత్రమే ప్రస్తుతం సౌర విద్యుత్‌వైపు ఆకర్షితులవుతున్నారని ఈ వర్గాలు పేర్కొంటున్నాయి. సౌర విద్యుత్ సబ్సిడీని మరింతగా పెంచడంతో పాటు, సౌరవిద్యుత్ కనెక్షన్లను వేగిరం చేయడం ద్వారా నష్టాన్ని కొంతమేరకైనా పూడ్చుకునే దిశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని సౌరవిద్యుత్ కంపెనీలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇదే అంశంపై విద్యుత్ శాఖ మంత్రి కేజే జార్జి మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రాల్లో సౌరవిద్యుత్ వాడకాన్ని విరివిగా పెంచే ఆలోచనలో ఉన్నామని, ఫలితంగా విద్యుత్ సమస్యను కూడా అధిగమించడంతో పాటు సౌరవిద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.



హంపి ఉత్సవ లోగో ఆవిష్కరణ

లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం తదితరులు



బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హంపి ఉత్సవాలు ఫిబ్రవరి 3 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన లోగోను ముఖ్యమంత్రి సిద్దరామయ్య శనివారం ఆవిష్కరించారు. విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్, నగరాభివృద్ధి శాఖ మంత్రి బైరతి సురేశ్, జిల్లా అధికారి దివాకర్, నటుడు, సంగీతదర్శకుడు సాధుకోకిల, డైరెక్టర్ కవితా లంకేశ్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల సంచారం కోసం వైర్‌లెస్ వ్యవస్థ

- ‘బ్రాండ్ బెంగళూరు’కు అందరి సలహాలు స్వీకరిస్తాం
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా సిగ్నల్ వ్యవస్థకు అనుసంధానంగా వైర్‌లెస్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. బ్రాండ్ బెంగళూరుపై పాఠశాల విద్యార్థులకు ‘ఐడియాథాన్’ పోటీలు నిర్వహించారు. శనివారం నగర పరిధిలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, విభిన్నరంగాల నిపుణులతో చర్చాగోష్టి జరిగింది. ఐడియాథాన్ విజేత విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసిన అనంతరం డీసీఎం మాట్లాడుతూ నగరంలో ఇకపై అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాలలో మహిళలకు అవసరమైన నాప్‌కిన్ల కోసం పింక్‌బూత్‌లు ఏర్పాటు చేయాలనే సలహాను వెంటనే అమలు చేస్తామని తెలిపారు. దేశ అభివృద్ధి, నాయకత్వ లక్షణాలు కేవలం రాజకీయ నాయకులకు మాత్రమే కాదని విద్యార్థి దశ నుంచే సమాజం, నివసించే పట్టణం గురించి కూడా తెలుసుకోవాలని సూచించారు. బెంగళూరుకు నిజమైన సంపద, శక్తి అంటే ఇక్కడి వాతావరణం, సంస్కృతి, మానవ వనరులు, పచ్చదనం కోసం ఇస్తున్న ప్రాధాన్యత వంటివి కారణాలన్నారు. నగరంలో మరింత పచ్చదనం పెంచేందుకు విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. నగరంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, ఈ పరిణామం రోడ్ల విస్తరణకు కారణమైందన్నారు. తద్వారా దశాబ్దాల క్రితం నాటి పచ్చదనం కనుమరుగైందన్నారు. ఇకపై నగరంలో అవకాశం ఉన్న ప్రతిచోటా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగించాలని సూచించారు. డీకే శివకుమార్ కుమార్తె ఐశ్వర్య మాట్లాడుతూ నగర సమస్యలు, సవాళ్లు మాత్రమే చర్చించేందుకు భేటీ కాలేదని, సకారాత్మకమైన మార్పులకు యువత ఆలోచనలు, పరికల్పనలు, అన్వేషణలకోసమన్నారు. బెంగళూరు మనపాలిట భావనాత్మకమైన సంబంధం కలిగి ఉందని, ఇక్కడ అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటిని సాంకేతికంగా పరిష్కరించే మార్గాలను తెలుసుకుందామన్నారు. మిత్ర అకాడమీ విద్యార్థులు రుతుస్రావంలో మహిళల సమస్యల పరిష్కారానికి పింక్‌బూత్‌ల సలహా ప్రతి ఒక్కరిని బాధ్యత గుర్తు చేసేలా ఉందని అభిప్రాయపడ్డారు.


ఐడియాథాన్ విజేతలతో డీసీఎం డీకే శివకుమార్ తదితరులు


హాజరైన జనం

విద్యార్థుల సలహాలు స్ఫూర్తినిచ్చాయి : సుధామూర్తి

విద్యార్థుల సలహాలు తనకు స్ఫూర్తినిచ్చాయని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సుధామూర్తి పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా ఎన్నో సభలు, సమావేశాల్లో పాల్గొన్నానని, ఇక్కడి విద్యార్థుల అభిప్రాయాలు తనకు ఆలోచన కలిగించాయన్నారు. పిల్లలు వారానికోసారి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, తద్వారా వారి ఆలోచనల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఆకు ఔషధగుణం కలిగి ఉంటుందని, ప్రతి అక్షరం జ్ఞానాన్ని ఇస్తుందని అదే తరహాలోనే ప్రతి విద్యార్థి కొత్త ఆలోచనలు వస్తాయని అటువంటి అవకాశం కల్పించిన ఐశ్వర్యకు అభినందనలని అన్నారు. నవంబరు 14న ప్రారంభమైన ఈ పోటీల్లో 200 పాఠశాలలు పాల్గొనగా రెండో రౌండ్‌కు 50, మూడో రౌండ్‌కు 25, చివరిదశకు 7 పాఠశాలలు చేరుకున్నాయని బ్రాండ్ బెంగళూరు ఐడియాథాన్ విజేతగా నేషనల్ హిల్ వ్యూ ప్రెసిడెన్సీ పాఠశాల నిలిచింది. నటుడు రమేశ్ అరవింద్, రాష్ట్ర ప్రభుత్వ అదనపు ముఖ్యకార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, డాక్టర్ అనూప్‌నాయక్, జి. బాలసుబ్రమణియన్, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

న్యాపతి సుబ్బారావు పంతులు (జయంతి)




'ఆంధ్రభీష్మ'గా పేరొందిన న్యాపతి సుబ్బారావు పంతులు 1856 జనవరి 14న నెల్లూరులో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంస్కరణ వాది, సాహితీవేత్త, పాత్రికేయుడు, రాజకీయ నాయకుడిగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రాజమండి సప్లయ్ కార్పొరేషన్‌ను స్థాపించి విద్యుత్ ఉత్పాదన చేయడమే కాక తొలిసారిగా రాజమండ్రికి విద్యుత్ సరఫరా చేశారు. కందుకూరి వీరేశలింగంతో సన్నిహితంగా ఉండేవారు. వివేకానందుని స్ఫూర్తితో సనాతన ధర్మప్రచారానికి కృషి చేశారు. 1941 జనవరి 15న కన్నుమూశారు.

సీడీ దేశ్‌ముఖ్ (జయంతి)



'పద్మవిభూషణ్ గ్రహీత సర్ చింతమన్ ద్వారకనాథ్ దేశ్‌ముఖ్ 1896 జనవరి 14న మహారాష్ట్రలోని రాజ్‌షడ్ ప్రాంతంలో జన్మించారు. బ్రిటీష్ వారిచే రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా నియమితులైన తొలి దేశీయ సివిల్ సర్వెంట్. 'కంపా నియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్‌గా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ఆర్థికమంత్రిగా వ్యవహరించారు. రామన్ మెగసెసె అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. 1982 అక్టోబరు 2న కన్నుమూశారు.

ఆర్‌కే శ్రీకంఠన్ (జయంతి)



'పద్మభూషణ్' రుద్రపట్టణ కృష్ణశాస్త్రి శ్రీకంఠన్ 1920 జనవరి 14న హాసన్ జిల్లా రుద్రపట్టణలో సంగీతకారుల కుటుంబంలో జన్మించారు. శృతి, లయ, సాహిత్యంపై అపారమైనజ్ఞానం కలిగి ఆలిండియా రేడియోలో ఫస్ట్‌గ్రేడ్ కళాకారుడిగా, సంగీత ప్రాయోజకులుగా 32ఏళ్లపాటు సేవలందించారు. జాతీయ, అంతర్జాతీయ కచేరీలలోనే కాక దేశవ్యాప్తంగా పర్యటించి సంగీత ఉపన్యాసాలు చేశారు. సంగీతనాటక అకాడమీ అవార్డ్, సంగీత కళానిధి, కనక-పురందర, గాన కళా ప్రవీణ తదితర అవార్డులు పొందారు. 2014 ఫిబ్రవరి 17న కన్నుమూశారు.

కేబీ తిలక్ (జయంతి)



కొల్లిపర బాలగంగాధర తిలక్ 1926 జనవరి 14న పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు ప్రాంతంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు. ప్రజానాట్య మండలిలో సభ్యుడిగా చేరి నాటకాలు ప్రదర్శించారు. అనంతరం సినీరంగ దర్శకుడిగా, నిర్మాతగా మారారు. అనుపమ చిత్ర బ్యానరుపై అభ్యుదయ భావాలతో సినిమాలు రూపొందించారు. 'భూమికోసం' సినిమా ఎంతో పేరొందింది. గాయని ఎస్ జానకి, నటి జయప్రదను వెండితెరకు పరిచయం చేశారు. 2008లో బీఎన్ రెడ్డి పురస్కారం అందుకున్నారు. 2010 సెప్టెంబరు 23న కన్నుమూశారు.

శోభన్‌బాబు (జయంతి)



'శోభన్‌బాబు'గా పేరొందిన ఉప్పు శోభనా చలపతిరావు 1937 జనవరి 14న కృష్ణా జిల్లా చిన నందిగామలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో కథా నాయకుడిగా కుటుంబ కథా భరితమైన, ఉదాత్తమైన వ్యక్తిత్వ కలిగిన పాత్రలలో రాణించారు. ప్రేమకథలలో విశిష్టమైన స్థానాన్ని పొంది ఆంధ్రుల అందాల నటుడిగా తెలుగువారి మదిలో నిలిచారు. నట భూషణ, సోగ్గాడు, ఆంధ్రా అందగాడు బిరుదులు ఉన్నాయి. 220కుపైగా సినిమాలలో నటించినా క్రమశిక్షణతో కూడిన జీవితానికి నిదర్శంగా నిలిచారనే పేరొందారు. 59వ ఏట నటనకు స్వస్తి పలికారు. 2008 మార్చి 20న కన్నుమూశారు.

రావుగోపాలరావు (జయంతి)



నటుడు రావుగోపాలరావు 1937 జనవరి 14న జన్మించారు. నాటకరంగం నుంచి వెండి తెరపైకి వచ్చారు. 'ముత్యాల ముగ్గు' సినిమాలో కంట్రాక్టర్ పాత్రతో ఆయన జీవితం మారి పోయింది. తెలుగు సినిమా విలనీలోనే కొత్తదనానికి రూపునిచ్చారు. దక్షిణ ఆసియాలో సినిమా సంభాషణలు సౌండ్‌ట్రాక్‌తో విడుదలైన తొలిలాంగ్ ప్లే రికార్డు 'ముత్యాలముగ్గు' సినిమాలో రావుగోపాలరావుది కావడం ఒక రికార్డు. తెలుగు ప్రతినాయకుల్లో 'నటవిరాట్'గా నిలిచారు. కళాప్రపూర్ణ, నంది ఇతర అవార్డులు పొందారు. రాజ్యసభ సభ్యుడు కూడా. 1994 ఆగస్టు 13న కన్నుమూశారు.

జంధ్యాల (జయంతి)



సినీరంగంలో 'హాస్యబ్రహ్మ'గా పేరొందిన జంధ్యాల వీర వెంకట దుర్గా శివసుబ్రమణ్య శాస్త్రి 1951 జనవరి 14న నరసాపురంలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో స్క్రీన్ రైటర్‌గా, దర్శకుడిగా, నటుడిగా తనదైన గుర్తింపు పొందారు. 24ఏళ్ల కెరీర్‌లో నాలుగు నంది, ఒక ఫిల్మ్‌ఫేర్ అవార్డు పొందారు. సినిమాలలో హాస్యానికి ట్రెండ్ తేవడమే కాక, పలువురు హాస్య నటులను వెండితెరకు పరిచయం చేశారు. ఆనంద భైరవి సినిమాకు ఉత్తమదర్శకుడిగాను, నంది అవార్డు కూడా పొందారు. 2001 జూన్ 19న కన్నుమూశారు.


క్యాసనూరు జ్వరానికి వ్యాక్సిన్ ఎప్పుడో..?

- ఆరు దశాబ్దాలకుపైగా పీడిస్తున్న వైరస్
- రాష్ట్రంలోని 11 జిల్లాల్లో ప్రభావం

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ వైరస్ వ్యాపించగానే ఏడాదిలోనే వ్యాక్సిన్ వచ్చేసింది. టీకామందు వేసుకోగానే భయంకరం అనిపించిన కొవిడ్ వైరస్ ప్రభావం తగ్గింది. ఒకటి రెండు విడతల కొవిడ్ తర్వాత వరుసగా వైరస్‌తో బాధితులు నమోదవుతున్నా వ్యాక్సిన్ కారణంగా ప్రాణాపాయం నుంచి బయటపడుతున్నారు. కానీ ఆరున్నర దశాబ్దాలకుపైగా రాష్ట్రంలోని మలెనాడుతోపాటు దక్షిణభారత్‌లోని ఐదు రాష్ట్రాలలో క్యాసనూరు ఫారెస్ట్ డిసీజ్ (కేఎఫ్‌డీ) ప్రభావం చూపుతోంది. ఏటా మరణాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా కేఎఫ్‌డీ జ్వరాలకు వ్యాక్సిన్ ఎప్పుడొస్తోందనని ఎదురుచూసే పరిస్థితి కొనసాగుతోంది. మలెనాడు అటవీ ప్రాంతాలక అనుబంధంగా ఉండే గ్రామాలలో ఏటా కేఎఫ్‌డీ జ్వరాలు ప్రబలుతున్నాయి. కోతుల ద్వారా ప్రబలే ఈ వైరస్ రోజుల వ్యవధిలోనే సమీప ప్రాంతాలన్నింటికీ ప్రబలుతోంది. మలెనాడు ప్రాంతం శివమొగ్గ, కొడగు, చిక్కమగళూరు, ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి, సరిహద్దులోని కేరళ రాష్ట్రం వయనాడు, మలప్పురం, గోవాలోని సత్తారి, పెర్నం, వల్‌పోయి, దర్బోందరా, మహారాష్ట్రలోని సింధుదుర్గ్, సావంతవాడి, దోడామార్గ్, తమిళనాడు రాష్ట్రంలోని నీలగిరి జిల్లాల్లో ప్రభావం ఉంది. మలెనాడులో ఎవరికైనా ఒకరికి కోతిజ్వరం వస్తే బయటకు వెళ్లరాదని అధికారులు కట్టడి చేస్తారు. జలుబు వస్తే ముక్కును కోసేసుకోవాలనే పరిస్థితి ఉంటుందని బాధితులు వాపోతుంటారు. కాఫీ, వక్కతోటలు విస్తారంగా ఉండే ఈ ప్రాంతంలోనే ఏటా కేఎఫ్‌డీ జ్వరాలు వస్తుంటాయి.

వ్యాక్సిన్‌కు ప్రజల డిమాండ్

కేఎఫ్‌డీ జ్వరాలకోసం కొత్త వ్యాక్సిన్‌ను కనుక్కోవడం లేదా గతంలో ఇస్తున్న మందులనే కొనసాగించడం, కేఎఫ్‌డీ నియంత్రణకోసమే ఉన్న డిప్యూటీ డైరెక్టర్ హోదాతో శివమొగ్గకు అధికారిని నియమించడం, ఏఏ ప్రాంతాలలో కేఎఫ్‌డీ వైరస్ సోకుతుందో అనేది అధ్యనం చేయాలని, దీర్ఘకాలంపాటు పనిచేసేలాంటి వ్యాక్సిన్‌లను ఆవిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరున్నర దశాబ్దాలుగా కేఎఫ్‌డీ జ్వరాలు వస్తున్నా సమగ్రమైన పరిశోధన చేయక పోవడంపై శివమొగ్గ జిల్లా వాసులు మండిపడుతున్నారు. కేఎఫ్‌డీ ప్రభావం 1957లో వెలుగులో చూడగా 83, 84లో ఏకంగా 69మంది మృతి చెందారు. 2003లో 11మంది, 2018లో 8మంది, 2019లో 12మంది, 2020లో ఒకరు తాజాగా వారం క్రితం ఒక మహిళ మృతి చెందారు. వైరస్ బాధితులు పెరగకముందే వ్యాక్సిన్ తయారీకి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రజా ప్రతినిధుల స్పందన ఏదీ...?

శివమొగ్గ జిల్లాకు చెందినవారు రాష్ట్ర ప్రభుత్వంలో కీలమైన మంత్రులుగా ప్రతి ప్రభుత్వంలోనూ ఉంటారు. పైగా సీఎంగా యడియూరప్ప ఈ జిల్లాకు చెందినవారే. ప్రస్తుతం ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప కాకుండా బీజేపీ ప్రభుత్వంలో హోం మంత్రిగా వ్యవహరించిన ఆరగ జ్ఞానేంద్ర కూడా జిల్లా వాసే. ప్రభుత్వాలు మారుతున్నా వ్యాధికి సంబంధించి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకునేలా ప్రయత్నించేవారు లేక పోయారనే విమర్శలు ఉన్నాయి.

విద్యారంగానికి తలమానికం మంగళూరు : మంత్రి నాగేంద్ర



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తుళునాడు మంగళూరు క్రీడారంగంతో పాటు విద్యా రంగంలోనూ అద్భుతంగా రాణిస్తోందని యువజన సేవలు క్రీడల శాఖా మంత్రి బీ నాగేంద్ర ప్రశంసించారు. మంగళూరులో శనివారం ఆయన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడోత్సవాలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన మంగళూరు ప్రజలు చాలా బుద్ధివంతులన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను తమ ప్రభుత్వం అన్ని విధాలా వెన్ను తట్టి పోత్సహిస్తోందని జాతీయ అంతర్జాతీయ క్రీడా పోటీలలో మన క్రీడాకారులు మరింతగా రాణించేలా వారికి ప్రత్యేక శిక్షణనిస్తూ తీర్చిదిద్దుతున్నామన్నారు. క్రీడాకారులచే గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం వారిని మంత్రి పరిచయం చేసుకున్నారు. కర్ణాటక మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్, దక్షిణ కన్నడ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ 42వ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ఆదివారం వరకు జరుగనున్నాయి. ఇందులో మొత్తం 31 జిల్లాల నుంచి 30 ఏళ్ళ నుండి 90 ఏళ్ళ వయస్సు కలిగిన అథ్లెట్లు పాలుపంచుకోనున్నారు.



క్రీడాకారులతో మంత్రి నాగేంద్ర

చిక్కబళ్లాపురలో భారీ ఉద్యోగ, రుణ మేళా

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ రామయ్య యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిక్కబళ్ళాపురంలో శనివారం బృహత్ ఉద్యోగ, రుణ మేళా విజయవంతంగా జరిగింది. ఈ మేళాలో 114కుపైగా కంపెనీలు పాలుపంచుకున్నాయి. స్థానిక సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థ ఆవరణలో జరిగిన ఈ మేళాలో ఎంపికైన 60 మంది నిరుద్యోగులకు పలు కంపెనీల అప్పాయింట్‌మెంట్ లెటర్లను యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షారామయ్య అందజేసి అభినందించారు. స్వయం ఉపాధి నిమిత్తం మేళాకు హాజరైన 40 శాతం మందికి రుణసదుపాయం కల్పించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఉద్యోగ మేళా సాయంత్రం వరకు కొనసాగింది. చిక్కబళ్ళాపుర చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 7,500 మంది నిరుద్యోగ యువతీయువకులు మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్షారామయ్య ప్రసంగిస్తూ దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఇదే తొలిసారి గత దశాబ్దకాలంగా నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే విషయంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏ మాత్రం చొరవ తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అందిస్తామని యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి, శక్తి, యువనిధి వంటి పథకాలు రాష్ట్రంలో నిరుద్యోగులకు ఎంతో ఆసరాగా ఉన్నాయని రక్షారామయ్య పేర్కొన్నారు. చిక్కబళ్ళాపురలో నిరుద్యోగ సమస్య అనేదే లేకుండా చేయాలన్నది తన సంకల్పమని ఈ దిశలో ప్రత్యేక సహాయ వాణిని, వాట్సాప్ చాట్ అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. ఈ మేళాలో ఉద్యోగాలు రాని నిరుద్యోగ యువత నిరాశపడవద్దని రానున్న రోజుల్లో అవకాశాలు లభించేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి విధానపరిషత్ సభ్యుడు నసీర్ అహ్మద్‌తో పాటు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.




నియామక పత్రం అందిస్తున్న రక్షా రామయ్య

ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి

తెలుగుదేశం ప్రభంజనం ఖాయం

- టీడీపీ కో-ఆర్డినేటర్ రావిమోహన్ చౌదరి

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మార్పు సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని కర్ణాటక తెలుగుదేశం పార్టీ కో-ఆర్డినేటర్ రావి మోహన్ చౌదరి పేర్కొన్నారు. నగరంలో శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ తరహా ఫలితాలు ఆంధ్రప్రదేశ్‌లోనూ పునరావృతం కావడం ఖాయమని ఇప్పటికే పలు సమీక్షలు వెల్లడిస్తున్నాయన్నారు. ఈ సారి తెలుగుదేశం ప్రభంజనం ఖాయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పాలనపై అన్ని వర్గాల్లోనూ, చివరికి ఉద్యోగుల్లోనూ తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉందని సర్వత్రా ప్రజాక్రోషం కనిపిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొని ఉందని ప్రతినెలా జీతాలు పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఏపిలో దిగజారిన శాంతిభద్రతల పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫలి తంగా పెట్టుబడులు రావడం లేదని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ సమీ కరణలన్నీ మార్పుకు సంకేతంగా ఉన్నాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజల చూపంతా తెలుగు దేశం జాతీయ అధ్య క్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పైనే ఉందన్నారు. ఆయన మరోసారి చక్రం తిప్పడం రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళతారని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని ఆయనను ముఖ్య మం త్రిగా చూడాలనుకుంటున్నారన్నారు. బెంగళూరు టిడిపి ఫో రం ఈ దిశలో ప్రవాసాంధ్రుల మద్దతును సమీకరించడంతో విజయ వంత మైందని ఆయన ప్రశంసించారు. కాగా కన్నడాంధ్ర ప్రజలందరికీ ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు పాడి పంటలతోనూ వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.



రావి మోహన్ చౌదరి

ఈశాన్యరాష్ట్రాల ఆరోగ్యసంరక్షణకు పెద్దపీట

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈశాన్యరాష్ట్రాల ప్రజల ఆరోగ్యసంరక్షణలో ఆయుష్ కార్యక్రమాలు బాగా దోహదపడనున్నాయని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి సర్బానంద సోనూవాల్ పేర్కొన్నారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల గౌహతిలో సెంట్రల్ ఆయుర్వేద పరిశోధనా సంస్థలో ప్రత్యేక పంచకర్మ బ్లాక్‌ను ప్రారంభించామన్నారు. సంప్రదాయవైద్యపద్ధతులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందన్నారు. కొవిడ్ అవధిలో ప్రధాని మోదీ అనుసరించిన విధానాలు ప్రజల ఆరోగ్య సవాళ్లను చాలావరకు తీర్చాయన్నారు. ఆరోగ్యరంగంలో ఖరీదైన వైద్యాన్ని సైతం ఆయుష్‌వంటి విధానాల ద్వారా సామాన్య నిరుపేద ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆయుష్‌ల్యాబ్‌లను మరిన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. ఆయుష్‌రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురు వైద్యులను బెంగళూరులో సన్మానించి అభినందించారు.



కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి సర్బానంద సోనూవాల్

కృత్రిమ మేధస్సుతో ట్రాఫిక్‌పై నిఘా

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్



ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలపై నిఘా కొనసాగనుందని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. శనివారం కంఠీరవ స్టేడియంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని లాంచనంగా ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన 6వేలమంది లైసెన్సులను రద్దు అయ్యాయన్నారు. ఎన్‌సీఆర్‌బీ నివేదికల ప్రకారం అత్యంత ప్రమాద మరణాలు హెల్మెట్ లేకపోవడంతోనే జరిగినట్టు గుర్తించారన్నారు. బెంగళూరులో 1.3 కోట్ల మంది నివసిస్తుండగా 55లక్షలకుపైగా వాహనాలు ఉన్నాయన్నారు. దేశంలోనే అత్యధిక కార్లు ఉన్న నగరంగా రికార్డుకెక్కింది. 2023 మార్చి 31 నాటికి బెంగళూరులో 23.1 లక్షల ప్రైవేట్ కార్లు ఉండగా, ఢిల్లీలో 20.7 లక్షల కార్లు మాత్రము ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది.

నందనలో సంక్రాంతి ఆహార ఉత్సవం



హోటల్లో వినూత్నంగా ఇలా...

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నందనా ప్యాలెస్ హోటళ్లలో సంప్రదాయమైన సంక్రాంతికి అద్దంపట్టేలా పలు రుచులను అందిస్తోంది. మకర సంక్రాంతి అనగా మంగళకరంగా పూర్వీకుల కాలంనుంచి పరిగణిస్తారు. కొత్త పంటలు చేతికి రావడంతో వీటికి సంబంధించిన వంటకాలు చేయనున్నారు. చెరుకు, వేరుశెనగ, వరి, పసుపు, గుమ్మడి, గెనుసుగడ్డ, ఇతర ధాన్యాలతో పండుగను ఆచరిస్తారు. పంట దిగుబడిన దేవుడికి సమర్పించడం ఆనవాయితీ ఉంది. నువ్వులు, చెరుకు పరస్పరం ఇచ్చి పచ్చుకునే పద్ధతి ఉంది. తద్వారా ఆత్మీయ సంబంధాలు నెలకొంటాయి. ఈ శుభసందర్భంగా నందన ప్యాలెస్‌లో తన సరి కొత్త శ్రేణి శైలి వంటకాలను ఈనెల 21 వరకు గ్రాండ్ సంక్రాంతి ఆహార ఉత్సవం పేరిట అందిస్తోంది. వెదురు పుట్టగొడుగులు, నాటుకోడి పులుసు, నాటుకోడి వేపుడు, మాంసం వేపుడు (బోన్‌లెస్), మాంసం సుక్కా, గోదావరి రొయ్యలవేపుడు, వంజరం చేపల భర్జీ, నెల్లూరు చేపలపులుసు, నెత్తిలి చేపల వేపుడు వంటివి ప్రత్యేకంగా అందిస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.

కుమార్తెకు కళాశాల సీటు కోసం అడ్డదారి....

- చివరికి అతడే కిడ్నాప్

బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కుమార్తెకు ప్రతిష్టాత్మక కళాశాలలో బీబీఏ సీటు సాధించుకునే దిశగా అడ్డదారిని ఎంచుకున్న పారిశ్రామికవేత్త ఏకంగా కిడ్నాప్‌కు గురయ్యారు. నగరంలోని సెయింట్‌జోసెఫ్ కళాశాలలో కుమార్తెను బీబీఏ కోర్సులో చేర్చేందుకు చేతన్ షా అనే పారిశ్రామిక వేత్త దరఖాస్తు చేసుకున్నారు. సీటు లభించడం కష్టంగా మారిందని భావించారు. ఇదే సందర్భంలోనే సచిన్ అనే వ్యక్తితో చర్చలు జరిపారు. సదరు కళాశాలలో అందరూ తెలిసిన వారేనని సీటు వచ్చేలా చూస్తానంటూ నమ్మించారు. ఇదే సందర్భంలో సీటు రావాలంటే కనీసం ఏడెనిమిది లక్షలు ఖర్చు అవుతుందని వివరించారు. అందుకు చేతన్ షా అంగీకరించారు. అయితే అతడి ద్వారా కూడా సీటు వచ్చేపరిస్థితి లేక పోయింది. చివరి క్షణంలో చేతన్ షా కళాశాలకు వెళ్ళి దరఖాస్తు గురించి వివరించి నిబంధనలకు అనుగుణంగానే సీటు సాధించారు. కొన్నిరోజుల తర్వాత బీబీఏ సీటు నా ద్వారానే వచ్చిందని సచిన్ డబ్బులు డిమాండ్ చేశారు. అందుకు చేతన్‌షా ససేమిరా అంటూ దాటవేశారు. దీంతో కుట్రపన్నిన సచిన్ తన మిత్రుడు గౌరీశంకర్‌తో కలిసి ఆటో ద్వారా వచ్చి చేతన్‌షా కారును అడ్డగించి కిడ్నాప్ చేసి ఏడులక్షలు నగదు వసూలు చేసుకుని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్‌లో వదిలి వెళ్ళారు. ఈమేరకు చేతన్‌షా రాజాజినగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువురిని అరెస్టు చేశారు. కాగా సచిన్ గ్రూప్ వన్ పరీక్షలకు సిద్ధమవుతూ కేసులో ఇరుక్కున్నారని తల్లిదండ్రులు వాపోయారు. కుమారుడు ఐఏఎస్ లేదా ఐపీఎస్ అవుతారని భావించగా జైలు పాలయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

అనంతపురంరూరల్, జనవరి 13: నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ క్రిష్ణప్రసాద్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. భోగి సందర్భంగా భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శన, క్లాసికల్ డాన్స్, జబర్దస్త్ బృందంచే కామెడీ స్కిట్స్, కొత్త సినిమా పాటలు ఉంటాయన్నారు. 15న క్లాసికల్ డ్యాన్స్, ఇంద్రజాల ప్రదర్శన, జిమ్నాస్టిక్స్, మిమిక్రీ ఉంటాయని పేర్కొన్నారు. 16వ తేదీ క్లాసికల్ డాన్స్, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు, గాలిపటాలు ఎగురవేయడం, ఇంద్రజాల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

పెనుకొండ వద్ద కర్ణాటక వాసి ఆత్మహత్య



పెనుకొండ రూరల్, జనవరి 13: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి, అప్పుల బాధ తాళలేక పెను కొండ సమీపంలోని మడకశిర రహదారిలో పాత సుంకు లమ్మ ఆలయం వద్ద సతీష్(45)అనే లారీ డ్రైవర్ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన సతీష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తు న్నాడు. సతీష్ తాడిపత్రి నుంచి సిమెంటును మంగళూరుకు తరలించే వాడు. అయితే ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అలవాటుపడిన సతీష్‌కు అప్పు లు అధికమయ్యాయి. దీంతో పండగకు ఇంటికెళ్తే అప్పుల వాళ్ల వచ్చి గొడవ చేస్తారని మనస్థాపానికి గుర య్యాడు. పెనుకొండ సమీపంలోని పాత సుంకులమ్మ ఆలయం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఇది హత్యా , ఆత్మహత్యా అనేది పోలీసుల దర్యాప్తు లో తేలాల్సి ఉందని స్థానికులు అంటున్నారు.

శాస్త్రోక్తంగా గోదా రంగనాథ పూజలు

అనంతపురం కల్చరల్, జనవరి 13: మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శనివారం సాయంత్రం శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో గోదా రంగనాథస్వామి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో గోదాదేవి సమేత రంగనాథ స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహిక విష్ణుసహస్రనామ, లక్ష్మీ అష్టోత్తర శత నామ స్తోత్ర పఠనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

నాసిన్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

హిందూపురం, జనవరి 13: పాలసముద్రం వద్ద నాసిన్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ప్రధాని రాకను పురస్కరించుకుని శనివారం జిల్లా అధి కారులు అక్కడ పర్యటించారు. నాసిన్ కేంద్రంలో ప్రధానమంత్రి ప్రారంభించే భవనాలతోపాటు ఐఆర్ఎస్‌లో సమావేశం శిక్షణా కేంద్రాలు, మోదీ పరిశీలించే ప్రాంతాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్ఎల్ శర్మ, ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్పీజీ అధికారులతో మాట్లాడారు. హెలీప్యాడ్, వేదిక స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ పనులు చేస్తున్నవారిని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు ఏర్పాట్లపై ముందస్తు సెక్యూరిటీ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని హాజరయ్యే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశ, నిర్దేశం చేశారు.

ప్రధాని పర్యటనపై సీఎస్ సమీక్ష

పుట్టపర్తి, జనవరి 13: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులతో శనివారం సమీక్షించారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలతో సమీక్షించారు. ప్రధాన పర్యటనకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

విజయవంతం చేయాలి: కలెక్టర్

ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి పర్యటనపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16న ప్రధాని జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కేంద్ర మంత్రులు పాల్గొనే అవకాశముందన్నారు. ఇందుకోసం సమష్టిగా, సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద నాసిన్ కంపెనీని ప్రధాన మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. పుట్టపర్తి విమానాశ్రం పరిసరాలను, ప్రధానమంత్రి భద్రతాధికారి పీకే. యాదవ్, డీఐజీ అమ్మిరెడ్డి, కలెక్టర్, ఎస్పీ మాధరెడ్డి, ఎస్పీజీ అధికారులు, ఏర్పాట్లును పరిశీలించారు.